సాక్షి
అనకాపల్లి
ఆదివారం, 20, ఏప్రిల్, 2025

మే మే ముందు

జిల్లాలో మేనెలరాక ముందే మే పుష్పాలు విరబూస్తూ కనువిందు చేస్తున్నాయి. ప్రతి ఏడాది మే నెలలో విరబూసే ఈ పువ్వులు.. గత 10 రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ముందస్తుగానే ఏప్రిల్ నెలలో విరబూసి కనువిందు చేస్తున్నాయి. హుకుంపేట మండలంలోని సన్యాసమ్మపాలెం గ్రామ శ్మశాన వాటిక సమీపంలో మే పుష్పాలు ముందుగానే విరబూశాయి. – సాక్షి,పాడేరు





అలరించిన గాత్ర కచేరీ

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో శనివారం ఐవటూరి కృష్ణ శృతి కర్ణాటక గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది.

● కూటమి 'మహా' నాటకం

ప్రజాస్వామ్యం ఖూనీ



లోపలికి ప్రవేశించేందుకు దౌర్జన్యంగా గేటును తోస్తున్న కూటమి నాయకులు, అడ్డుకుంటున్న పోలీసులు

జీవీఎంసీలో శనివారం జరిగిన పరిణామాలు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. అధికార మదంతో, ధన బలంతో కూటమి నేతలు సాగించిన అరాచకం యావత్ రాష్ట్రాన్ని నివ్వెరపరిచింది. కేవలం 10 నెలల అధికారం కోసం.. ప్రజల చేత ఎన్నికైన ఒక బీసీ మహిళా మేయర్‌ను గద్దె దించేందుకు వారు పన్నిన కుట్రలు, కుతంత్రాలు హేయమైనవి. ఈ చర్యలు విశాఖ నగర ప్రతిష్టను మసకబార్చాయి. యాదవ సామాజిక వర్గానికి చెందిన బీసీ మహిళ విషయంలో అధికార కూటమి సాగించిన 'మహా' నాటకం ఇది. – డాబాగార్డెన్స్ (విశాఖ)

- ఫిరాయింపులతో నెగ్గిన అవిశ్వాసం
- డబ్బు, బెదిరింపులతో జీవీఎంసీ పీఠం కైవసం
- ఒకే ఒక్క ఓటుతో గట్టెక్కిన వైనం
- బీసీ మహిళా మేయర్‌పై కక్ష సాధింపు



జీవీఎంసీ వద్ద పోలీసుల బందోబస్తు

అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో కూటమి నేతల లక్ష్యం ఒక్కటే.. మేయర్ పదవిని ఎలాగైనా చేజిక్కించుకోవడం. ఇందుకోసం వారు నైతిక విలువలను తుంగలో తొక్కారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను భయపెట్టారు. బెదిరించారు. లొంగని వారిపై ఒత్తిడి తెచ్చారు. కోట్ల రూపాయలను ఎరగా వేసి.. కొందరు కార్పొరేటర్ల ఆత్మగౌరవాన్ని కొనుగోలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ.. కూటమి నేతలు సాగించిన కుట్రలు, కుతంత్రాలు, డబ్బు రాజకీయాలు శనివారం నగర ప్రజల ముందు బట్టబయలయ్యాయి. నెలరోజులకు పైగా సాగించిన ఈ ప్రయత్నాల్లో కోట్లాది రూపాయలు మంచినీళ్లలా ఖర్చు చేసినా.. కార్పొరేటర్లను చివరి నిమిషం వరకు బెదిరించి, లోబరచుకోవాల్సిన దుస్థితి అధికార కూటమికి ఏర్పడింది.

అధికార దుర్వినియోగం, పోలీసుల పహారా

అవిశ్వాస తీర్మానం రోజు కూటమి నేతల అప్రజాస్వామిక చర్యలు పరాకాష్టకు చేరాయి. చివరి నిమిషం వరకు తమ సంఖ్యాబలంపై నమ్మకం లేక.. కార్పొరేటర్లు చేజారిపోతారనే భయంతో వణికిపోయారు. అవిశ్వాస సమావేశం సందర్భంగా వారి వ్యవహారశైలి చూస్తే ఇదే స్పష్టమైంది. హోటళ్లలో దాచిన కార్పొరేట్లను అక్కడి నుంచి జీవీఎంసీకి తరలించే క్రమంలో అడుగడుగునా పోలీసులను అడ్డుపెట్టుకున్నారు. వారి సమక్షంలోనే నేరుగా జీవీఎంసీలోకి బస్సును వెళ్లింది. బస్సు దిగిన తర్వాత కూడా కూటమి నేతల ఆగడాలు ఆగలేదు. కార్పొరేటర్లను బెదిరిస్తూ సమావేశ మందిరంలోకి తీసుకెళ్లారు. అనుకూలంగా చెయ్యి ఎత్తకపోతే తీవ్ర పరిణామాలుంటాయని బెదిరించి ఓట్లు వేయించుకున్నారు. ఎన్ని కుట్రలు, బెదిరింపులు, ప్రలోభాలు సాగించినా, చివరికి అవిశ్వాస తీర్మాన సమయానికి వారికి దక్కిన బలం కేవలం 74 మంది మాత్రమే! చివరి నిమిషంలో తిప్పల వంశీతో పాటు మాజీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు భార్య, కోడలు వంటి వారిపై తీవ్ర ఒత్తిడి తెచ్చి కూటమి వైపు తిప్పుకున్నారు. వారిలో ఏ ఒక్కరు రాకపోయినా అవిశ్వాసం వీగిపోయేది.

వైఎస్సార్ సీపీకి స్పష్టమైన మెజార్టీ

2021లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి స్పష్టమైన మెజార్టీ ఇచ్చి 59 స్థానాల్లో గెలిపించారు. టీడీపీ 29, జనసేన 3తో పాటు ఇతరులు గెలుపొందారు. బీసీ జనరల్‌కు రిజర్వ్ అయిన మేయర్ పదవిలో యాదవ సామాజిక వర్గానికి చెందిన గొలగాని హరి వెంకటకుమారిని అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూర్చోబెట్టారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే జీవీఎంసీపై కన్ను పడింది. ప్రజా తీర్పును గౌరవించకుండా, ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ మేయర్‌ను దించేందుకు కుతంత్రాలు మొదలుపెట్టారు. నాలుగేళ్ల అవిశ్వాసం నిబంధన ఉన్నప్పటికీ.. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను కొనుగోలు చేసేందుకు బహిరంగంగానే కోట్లాది రూపాయ లు కుమ్మరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కొందరు టీడీపీలోకి, మరికొందరు జనసేనలోకి జంప్ చేసి తమ నీతిమాలిన రాజకీయాన్ని ప్రదర్శించారు. కేవలం 29 మందితో ఉన్న టీడీపీ, ఫిరాయింపులతో బలం పెంచుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది.

అవిశ్వాసం సాగిందిలా..

జీవీఎంసీలో మొత్తం స్థానాలు 98కి గానూ అప్పట్లో వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన వంశీకృష్ణ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. ఆ స్థానానికి ఎన్నిక జరగలేదు. దీంతో 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మొత్తం 111 మంది సభ్యుల్లో 2/3 వంతు మెజార్టీ ఉంటేనే అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. ఆ లెక్కన 74 మంది సభ్యుల మద్దతు కూటమికి అవసరం. ఆ మ్యాజిక్ ఫిగర్ చేరుకోవడానికి నేతలు తలకిందులాగా ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌కు గత నెల నోటీసులిచ్చారు. ఈ మేరకు శనివారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరిగింది. సరిగ్గా 74 మందే హాజరు కావడంతో కూటమి నెగ్గింది.

కార్పొరేటర్లను భయపెట్టారు

ప్రశాంతతకు మారు పేరుగా విశాఖకు మంచి పేరుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాదవ సామాజిక వర్గానికి చెందిన బీసీ మహిళకు మేయర్ పదవినిచ్చి గౌరవిస్తే.. యావత్ రాష్ట్రం హర్షం వ్యక్తం చేసింది. ఈవీఎంల ద్వారా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డబ్బు సంచులతో విపరీత ధోరణితో మహిళా కార్పొరేటర్లను సైతం భయపెట్టి మేయర్ పీఠం దక్కించుకుంది. కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు.

– కె.రామచంద్రమూర్తి, సీనియర్ సిటిజన్

యాదవ మహిళ టార్గెట్

యాదవ సామాజిక వర్గానికి చెందిన గొలగాని హరి వెంకటకుమారి మేయర్‌గా ఉండటం ఇష్టం లేక కూటమి నేతలు కక్షగట్టారు. ఒక బీసీ మహిళ ఆ పదవిలో ఉండటాన్ని సహించలేకపోయారు. ఆమెను గద్దె దించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకుని.. నెలల తరబడి కుట్రలు పన్నారు. ఇది కేవలం రాజకీయ అవిశ్వాసం కాదు.. ఒక సామాజిక వర్గానికి చెందిన మహిళపై జరిగిన దాడిగా చూడాలని పలు వర్గాలకు చెందిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బస్సులో లోపలకు వెళ్తున్న కూటమి కార్పొరేటర్లు

నైతికత లేని విజయం

ఇన్ని కుట్రలు, కుతంత్రాలు, బెదిరింపులు, ప్రలోభాలకు పాల్పడినా, కూటమి నేతలు సాధించింది ఏమిటి? అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి అవసరమైన 74 మంది సభ్యులను మాత్రమే.. అదీ చివరి నిమిషంలో కొందరిని ఒత్తిడికి గురి చేసి సమీకరించగలిగారు. ఒక్క సభ్యుడు తగ్గినా వారి కుట్ర బెడిసికొట్టేది. వైఎస్సార్ సీపీ టికెట్‌పై గెలిచి, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి, పదవికి రాజీనామా చేయకుండా పార్టీ మారిన వారిపై ఆధారపడి సాధించిన ఈ విజయం అనైతికం. నిజంగా ధైర్యం ఉంటే, ఫిరాయించిన కార్పొరేటర్లు తమ పదవులకు రాజీనామా చేసి, తిరిగి ఎన్నికలకు వెళ్లాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు ఒక పార్టీ జెండాపై గెలిపిస్తే.. డబ్బులకు, పదవులకు ఆశపడి పార్టీలు మారిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల తీరును అసహ్యించుకుంటున్నారు.

విప్ ధిక్కరించిన 27 మందిపై అనర్హత వేటు వేయండి

వైఎస్సార్ సీపీ డిమాండ్

సాక్షి, విశాఖపట్నం: మేయర్‌పై జరిగిన అవిశ్వాస తీర్మానంలో పార్టీ విప్‌ను ధిక్కరించి.. వ్యతిరేకంగా ఓటు వేసిన 27 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను తక్షణమే అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఆ పార్టీ విప్ తైనాల విజయ్‌కుమార్.. జిల్లా ఎన్నికల అధికారి, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. 2008 మున్సిపల్ కార్పొరేషన్ చట్టం(జీవో ఎంఎస్ నంబర్ 836/ఎంఏయూడీ)లోని రూల్ నంబర్ 9 లోని 'నో కాన్ఫిడెన్స్ మోషన్' నిబంధనలను ఈ సందర్భంగా తైనాల ప్రస్తావించారు. ఈ రూల్ ప్రకారం ఏదైనా పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజా ప్రతినిధులు, అవిశ్వాస తీర్మానం వంటి సందర్భాలలో పార్టీ ఆదేశించిన విధంగానే ఓటు వేయాలి. లేని పక్షంలో వారి సభ్యత్వాన్ని రద్దు చేసే పూర్తి హక్కు సంబంధిత పార్టీకి ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుంటే.. న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. పార్టీ నేత పల్లా దుర్గారావు ఆయన వెంట ఉన్నారు.



జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తైనాల, పల్లా దుర్గారావు

కార్పొరేటర్లను పశువుల్లా కొన్నారు

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కన్నబాబు, మాజీ మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ కన్నబాబు, మాజీమంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, తైనాల విజయకుమార్

సాక్షి, విశాఖపట్నం: తమ పార్టీలో గెలిచిన కార్పొరేటర్లను సంతలో పశువుల్లా కొన్నారని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబులతో కలిసి వారు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీరు చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. రాజరికంలో ఉన్నామా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని, విలువలను అపహాస్యం చేసి అవిశ్వాసం గెలిచినా.. రాజకీయంగా వాళ్లకు వాళ్లే సమాధి కట్టుకున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీ నాయకులను తీసుకోబోమని డిప్యూటీ సీఎం చెప్పారని, కేవలం 10 నెలల మేయర్ పీఠం కోసం ఇప్పుడు తమ కార్పొరేటర్లను ఇబ్బందులకు గురి చేశారన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే తమ పార్టీ నుంచి తీసుకున్న 27 మంది కార్పొరేటర్లతో రాజీనామా చేయించి.. మీ పార్టీ గుర్తుల మీద గెలిపించి మేయర్ పదవిని దక్కించుకోవాలని సవాల్ విసిరారు. బీసీ మహి ళను దించిన పార్టీలుగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన చరిత్రలో మిగిలిపోతాయని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైస్రాయ్ హోటల్ రాజకీయాలే నేటికీ నడుస్తున్నాయని, విశాఖ ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే 10 నెలల మేయర్ పీఠం కోసం దిగజారి రాజకీయాలు చేశారని విమర్శించారు. నాలుగేళ్లుగా నిజాయితీతో పనిచేస్తున్న బీసీ మహిళను దించడం దారుణమన్నారు. అధికార బలంతో, డబ్బుందన్న అహంకారంతో ప్రత్యేక విమానాలు తీసుకుని ప్రజాధనాన్ని ఖర్చు చేశారని మండిపడ్డారు. వ్యవస్థలను, పోలీసులను, అధికారులను ఉపయోగించుకుని స్వల్ప తేడాతో గెలిచారని ఎద్దేవా చేశారు. సమావేశంలో జెడ్పీ చైర్ పర్సన్ జె.సుభద్ర, అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పాల్గొన్నారు.

మేయర్‌గా ప్రయాణం సంతృప్తికరం

- వైఎస్ జగన్ ఆశీస్సులతోనే సేవ చేసే గొప్ప అవకాశం దక్కింది
- విశాఖ ప్రజలకు కృతజ్ఞతలు : హరివెంకటకుమారి



సభను నడిపిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి (ఫైల్)

డాబాగార్డెన్స్: జీవీఎంసీ మేయర్‌గా నాలుగేళ్ల పాటు ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం లభించడం తనకెంతో సంతృప్తినిచ్చిందని గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. తన పదవిని బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ, నగర పౌరులకు సేవలు, సంక్షేమ పథకాలు అందించడంలో, మౌలిక సదుపాయాలు కల్పించడంలో కృషి చేశానని తెలిపారు. ఈ నాలుగేళ్ల కాలంలో నగర అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా, ప్రతి కార్పొరేటర్‌ను సమ దృష్టితో చూస్తూ.. వారి వార్డుల అభివృద్ధికి మనస్ఫూర్తిగా నిధులు కేటాయించినట్లు గుర్తు చేసుకున్నారు. ఎన్నో క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే అవకాశం లభించిందని, ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో ప్రజలకు అండగా నిలబడి, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం గొప్ప సేవానుభూతినిచ్చిందన్నారు. అడవివరం నుంచి గోశాల రోడ్డు, జగదాంబ జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్, పాత పోస్టాఫీస్ వరకు రోడ్లు, బస్‌బేలు, జంక్షన్ల అభివృద్ధి వంటి అనేక పనుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించినట్లు చెప్పారు. తనకు వ్యతిరేకంగా ఓటు వేసిన కార్పొరేటర్లకు సైతం నిధుల కేటాయింపులో ఎటువంటి వివక్ష చూపలేదనే విషయం తెలుసునని హరివెంకటకుమారి అన్నారు. నాలుగేళ్ల ఒక నెల పాటు మేయర్ క్యాంపు కార్యాలయాన్ని తన సొంత భవనంలో నిర్వహించుకుంటూ.. కార్పొరేషన్ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదన్నారు. నగరం కాలుష్యానికి గురి కాకూడదనే ఉద్దేశంతో ప్రతి సోమవారం సొంత వాహనాన్ని వదిలి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వచ్చానని, ఈ విషయంలో తోటి ఉద్యోగులను కూడా ప్రోత్సహించినట్లు చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే విశాఖ గర్వించేలా ర్యాంకులు సాధించడంలో తన వంతు కృషి చేశానన్నారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు మంజూరు చేసిన తనపైనే అవిశ్వాస తీర్మానం పెట్టడం బాధ కలిగించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతోనే యాదవ సామాజిక వర్గానికి చెందిన బీసీ మహిళగా తనకు ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం లభించిందని ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ ప్రయాణంలో తనకు సహకరించిన నగర ప్రజలు, అధికారులు, పార్టీ నేతలు, కార్పొరేటర్లు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ వేస్ట్ యూనిట్ ప్రారంభం



చోడవరంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ విజయ కృష్ణన్

చోడవరం: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. చోడవరంలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. ముందుగా స్థానిక శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆమె పంచాయతీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ భవనం వద్ద ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అక్కడ నుంచి మెయిన్‌రోడ్డుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రాబ్యాంక్ రోడ్డులో ఉన్న రైతు బజార్‌లో రోడ్లపై పడి వున్న చెత్తను కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు అంతా కలిసి ఎత్తి శుభ్రం చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఈ వేస్ట్ యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి, తహసీల్దార్ రామారావు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మ, పంచాయతీ ఈఓ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

తుమ్మపాల: జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు శనివారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలు నాటి పరిసరాలను పరిశుభ్రం చేసి సేకరించిన ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ పరికరాలను చెత్త బుట్టలో వేశారు.

గంజాయి రవాణాకు గేట్లు ఎత్తేశారు..

- గుమ్మడిగొండ శివారులో పోలీసు చెక్‌పోస్టు మూసివేత
- యథేచ్ఛగా గంజాయి తరలిస్తున్న స్మగ్లర్లు



గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం సమీపంలో పోలీస్ చెక్‌పోస్టు

నాతవరం: గంజాయి, ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టు నిరుపయోగంగా మిగిలింది. గంజాయి రవాణాకు గేట్లు ఎత్తేసినట్టయింది. నిర్వహణ లేక సామగ్రి కళ్ల ముందే శిథిలమవుతోంది. మండలంలో గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై గతంలో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు వద్ద పోలీసులు కాపలా ఉండేందుకు ఐరన్ షెడ్‌తో ఠాణా ఏర్పాటు చేశారు. ఇందుకోసం అప్పట్లో సుమారు రూ.5 లక్షల నిధులు ఖర్చు చేశారు. ఈ చెక్‌పోస్టు ద్వారా మండలంలో తాండవ ఏటి అవతల గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా పూర్తిస్థాయిలో నివారించారు. గతంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి మండలాల నుంచి నాతవరం మండలంలోని తాండవ ఏటి అవతల గ్రామాల మీదుగా నిత్యం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు గంజాయి రవాణా జరిగేది. ఇక్కడ చెక్‌పోస్టు ఏర్పాటు చేయడం వలన గంజాయి రవాణా నివారించగలిగారు. ప్రస్తుతం పోలీసు చెక్‌పోస్టును ఎత్తేయడంతో ఈ ప్రాంతం మీదుగా గంజాయి యథేచ్ఛగా తరలిపోతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆనుకొని నాతవరం మండలం ఉండటంతో తుని రైల్వే స్టేషన్‌కు చిక్కుడుపాలెం మీదుగా రాకపోకలకు అనువుగా ఉంటుంది. ప్రభుత్వం ఇసుక ఉచితం అని ప్రకటించడంతో ఇక్కడ పోలీసు చెక్‌పోస్టు నిర్వహణ నిలిపివేశారు. గతంలో ఇక్కడ పోలీసు చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నేరుగా జిల్లా అధికారులు పర్యవేక్షించేవారు. ఇప్పుడు చెక్‌పోస్టు లేకపోవడంతో గంజాయి స్మగ్లర్లు ఇదే అదనుగా భావించి ఈ ప్రాంతాన్ని రవాణా జోన్‌గా మలుచుకున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పునరుద్ధరిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

కన్నీరు ఇంకని కైలాసపట్నం

- ఫైర్ వర్క్స్ మేనేజర్ జానకీరామ్ మృతి
- 10కి చేరిన మృతుల సంఖ్య



మడగల జానకీరామ్ (ఫైల్)

కోటవురట్ల: కైలాసపట్నం మరోసారి గొల్లుమంది. వారం రోజులపాటు మృత్యువుతో పోరాడిన విజయ లక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్ మేనేజర్ మడగల జానకీరామ్ (50) చివరికి కన్నుమూశారు. దాంతో బాణసంచా ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య పదికి చేరుకుంది. ఈ నెల 13వ తేదీన బాణసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఆ రోజు 8 మంది మృతి చెందగా మరో 8 మంది గాయపడిన విషయం తెలిసిందే. అందులో జల్లూరు నాగరాజు 17వ తేదీన కేజీహెచ్‌లో మృతి చెందగా, ఫైర్ వర్క్స్ మేనేజర్ మడగల జానకీరామ్ మెడికవర్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. మృతి సమాచారం తెలియడంతో ఉదయం నుంచి కైలాసపట్నంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం విశాఖ నుంచి మృతదేహం గ్రామానికి చేరగానే రోదనలు మిన్నంటాయి. భారీసంఖ్యలో చేరుకున్న జనం కన్నీటి వీడ్కోలు పలికారు. మృతునికి భార్య అమరావతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె దివ్య రిషికేష్ లోని ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. కుమారుడు కిషోర్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇద్దరి పిల్లల ఉన్నతి చూడకుండానే తండ్రి జానకీరామ్ మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన మామ శానాపతి పైడియ్యనాయుడు (బాబూరావు), పెద్ద అల్లుడు అప్పికొండ తాతబాబు ప్రమాద ఘటన రోజునే మృతి చెందగా చిన్నల్లుడు మడగల జానకీరామ్ ఇపుడు మృతి చెందారు. దాంతో ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరితరం కావడంలేదు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి ఎస్పీ అభినందనలు



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి మొక్కను బహూకరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన చిన్నంశెట్టి రాజును ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను బహూకరించి, అభినందనలు తెలిపారు.

మనసు పెడితే కొలువు సులువు

- యూపీ అడిషనల్ డీజీపీ సత్యనారాయణ
- లైబ్రరీకి స్టడీ మెటీరియల్ అందజేత
- పోటీ పరీక్షల అభ్యర్థులకు సూచనలు



కుటుంబ సభ్యులతో స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న యూపీ అడిషినల్ డీజీపీ సత్యనారాయణ

నర్సీపట్నం: గుడ్డిగా కాకుండా మనసు పెట్టి చదివితే కొలువు సులువుగా సాధించవచ్చునని ఉత్తరప్రదేశ్ అడిషనల్ డీజీపీ కిల్లాడ సత్యనారాయణ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సూచించారు. నర్సీపట్నానికి సమీపంలోని తన సొంత గ్రామమైన పాములవాకకు ఆయన శనివారం వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం నర్సీపట్నం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. ఆర్ఆర్‌బీ, డీఎస్సీ పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అడిషనల్ డీజీపీ సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు గ్రంథాలయ అధికారి దమయంతికి అందజేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల అభ్యర్థన మేరకు కూల్ పెయింట్ వేసేందుకు రూ.25 వేలు గ్రంథాలయ అధికారికి అందజేశారు. తాను పదో తరగతి సెకండ్ క్లాస్‌లో పాసయ్యానని, ఇంటర్మీడియేట్ పరీక్ష తప్పానని చెబుతూ.. ఆ ఫెయిల్యూర్ తనలో కసిని పెంచిందన్నారు. సివిల్స్‌కు గురి పెట్టి అనుకున్న లక్ష్యాన్ని సాధించానన్నారు. ఎవరి మీద ఆధారపడకుండా సొంతంగా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. జనరల్ నాలెడ్జిలో పట్టు సాధించాలని, ఆన్‌లైన్ టెస్టులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదివిన ప్రతి చాప్టర్‌పై కమాండ్ సాధించాలన్నారు. అప్పుడే పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కోగలరన్నారు. తనకు పరిచయం ఉన్న శిక్షకులతో ఆన్‌లైన్ క్లాస్‌లు ఇప్పిస్తానని మాటిచ్చారు. అనంతరం అడిషనల్ డీజీపీ దంపతులను గ్రంథాలయ అధికారి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు శాలువ కప్పి సత్కరించారు. జ్ఞాపిక అందజేశారు.

పోక్సో కేసులో తండ్రీ కొడుకులు అరెస్ట్

నాతవరం : మాధవనగరం గ్రామానికి చెందిన గుడివాడ హరీష్, ఆయన తండ్రి దొరబాబును పోక్సో చట్టం కింద శనివారం అరెస్ట్ చేసినట్లు నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మాధవనగరానికి చెందిన ఒక బాలికతో గత కొన్నేళ్లుగా హరీష్ ప్రేమాయణం సాగిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా లోబర్చుకున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు హరీష్‌ను మందలించి, పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఊరుకున్నారు. హరీష్ ఏలేశ్వరం మండలం గున్నావారిపాలెం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ వేరొక అమ్మాయిని వివాహం చేసుకునేందుకు ప్రయత్నించడంతో బాలిక తల్లిదండ్రులు నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ గ్రామంలో శుక్రవారం విచారణ నిర్వహించిన అనంతరం శనివారం పోక్సో కేసు నమోదు చేసి, హరీష్‌తోపాటు ఆయన తండ్రి దొరబాబును అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో చక్కని ఆరోగ్యం



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, పోలీస్ సిబ్బంది

అనకాపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వలన ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించవచ్చని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణం స్వచ్ఛంగా ఉండాలన్న భావనను బలపరచడం పోలీసుల సహజమైన సామాజిక బాధ్యత అన్నారు. పోలీసులు కేవలం న్యాయాన్ని కాపాడే వారు మాత్రమే కాదని, సమాజ మంచి చెడులను తెలుసుకుని జీవనం సాగిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి వ్యక్తి కృషి చేయాలని, భవితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

గంజాయితో ఇద్దరు యువకుల అరెస్టు

చోడవరం : గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పాపునాయుడు శనివారం తెలిపారు. చోడవరం డిగ్రీ కాలేజీ సమీపంలో ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో వారిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద 3.85 కేజీల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించామన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఇద్దరు బాలికల ఎంపిక



క్రీడాకారులకు అభినందన

అచ్యుతాపురం రూరల్: జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో అనకాపల్లి జిల్లా అసోసియేషన్ నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎన్.వి.జగదీష్ శనివారం తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో అస్సాంలో జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో మండలానికి చెందిన ధర్మిరెడ్డి వసంత (అచ్యుత కళాశాల), బొట్ట సంధ్య (క్రైట్స్ కళాశాల) పాల్గొంటారని చెప్పారు. వీరు ఇదివరలో అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో అస్సాంలో జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమలానాయుడు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో మంచి క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోచ్ వెంకట్ ఆకాక్షించారు.

సామాన్లోయ్... సామాన్లు...!

- ఈ వేస్ట్ కోసం ఇంటింటికీ
- పంచాయతీ కార్యదర్శులకు అదనపు భారం
- అసలు విధులకు ఎసరు
- చిరువ్యాపారుల ఉపాధిపై వేటు

నక్కపల్లి: స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పేరుతో శనివారం ప్రభుత్వం నిర్వహించిన ఈ వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ) నవ్వుల పాలవుతోంది. ప్రభుత్వ తీరు గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత ఇనుప వస్తువులు, ఇతర చెత్తను సేకరించి స్క్రాప్ దుకాణాల్లో విక్రయించి ఉపాధి పొందే రోజువారి కూలీల పొట్టకొడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ కార్యదర్శులు అసలు విధులను పక్కన పెట్టి ప్లాస్టిక్ డబ్బాలు చేతపట్టి ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే విధులను మాత్రమే నిర్వహించాల్సి వస్తోందన్న ప్రచారం జరుగుతోంది. గతంలో కార్యదర్శులు పంచాయతీ కార్యాలయాల్లో ఉంటూ ఇంటి పన్నులు వసూళ్లు, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు రూపొందించడం, పంచాయతీ రికార్డుల నిర్వహణ, పంచాయతీ తీర్మానాలు అమలు చేయడం, గ్రామంలో పంచాయతీ పాలక వర్గాలు సూచించిన పనులు చేపట్టడం, ఏయే పనులు అవసరమో గుర్తించి వాటిని పూర్తి చేయడం, జనన మరణాలు నమోదు చేయడం, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం, పంచాయతీకి మండల పరిషత్ కార్యాలయానికి వారధిగా ఉంటూ నిధులు రాబట్టేందుకు కృషి చేయడం, వీధి దీపాల నిర్వహణ, శానిటేషన్ పనుల నిర్వహణ చేసేవారు. చెత్త సేకరణ, చెత్త తొలగింపు అనేది పంచాయతీ స్వీపర్ల ద్వారా చేయించేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్పెషల్ డ్రైవ్‌ల పేరుతో శని, ఆదివారాల్లో కూడా కార్యదర్శులకు చేతినిండా పని కల్పిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు చేసే పనులను సైతం కార్యదర్శులతో చేయిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా మూడో శనివారం ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యేక డ్రైవ్ కింద చేపట్టిన ఈవేస్ట్ సేకరణ మరిన్ని విమర్శలకు తావిచ్చింది. గ్రామాల్లో ఇళ్లతోపాటు, కంప్యూటర్ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటర్నెట్ కేంద్రాలు, జెరాక్స్ సెంటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు విక్రయించే దుకాణాల వద్దకు పంచాయతీ సిబ్బంది వెళ్లి ఈవేస్ట్/ ఎలక్ట్రానిక్ చెత్తను సేకరించడం పట్ల పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. పర్యావరణాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నప్పటికీ ఇదే పనిపై ఆధారపడి జీవిస్తున్న కొంతమంది పేదల ఉపాధి దెబ్బతీస్తున్నారన్న వాదన వినిపిస్తోంది.

ఇప్పటి వరకు గ్రామాల్లో ఇటువంటి చెత్తను ఏ ఉపాధి లేని కొంతమంది వ్యక్తులు సైకిళ్లు ద్విచక్రవాహనాల్లోను, ఆటోల్లోను వచ్చి ఇళ్ల వద్ద పనికిరాని ప్లాస్టిక్ సామాన్లు, పాడయిన కంప్యూటర్లు, ప్రింటర్లు, పాత సెల్‌ఫోన్లు, విరిగిపోయిన కుర్చీలు, కాలిపోయిన ట్యూబులైట్లు, బల్బులు, పైపులు, తదితర చెత్తను సేకరిస్తారు. ఇలా సేకరించిన సామాన్లకు కిలోకు ఇంత రేటు నిర్ణయించి చెల్లించడం లేదా ఉల్లిపాయలు, ముగ్గు, బతాసీలు ఇస్తుంటారు. ఇళ్లల్లో వృథాగా పడి ఉన్న చెత్తను ఇలా గ్రామాల్లోకి అప్పుడప్పుడు వచ్చేవారికి ఇంటి యజమానులు ఇచ్చేస్తుంటారు. ఇలా గ్రామాల్లో సేకరించిన పాత సామాన్లను వారు పట్టణ ప్రాంతాల్లో ఉన్న పాత ఇనుప సామాన్ల దుకాణాలకు ఇచ్చి వారినుంచి కొంత మొత్తాన్ని తీసుకుని ఉపాధి పొందుతుంటారు. ప్రభుత్వం తాజాగా ఈ వేస్ట్ పేరుతో ఇళ్లకు వెళ్లి పాత ప్లాస్టిక్ ఇనుప, ఎలక్ట్రానిక్ సామాన్లను సేకరించడం వల్ల గ్రామాల్లో ఇటువంటి వారి ఉపాధి దెబ్బతింటుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెత్తను తొలగించడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం, క్లోరినేషన్ చేయడం, బ్లీచింగ్ జల్లించడం, తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు చేర్చడం వరకు బాగానే ఉన్నప్పటికీ పాతసామాన్లను కూడా ప్రభుత్వమే సేకరించడం సిగ్గుచేటన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను గ్రామాల్లో ప్రత్యేకంగా నిర్మించిన సంపద తయారీ కేంద్రాలకు తరలించి అక్కడ వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేసి విక్రయిస్తూ సంపద సృష్టిస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీని వరకు నమ్మశక్యంగానే ఉన్నప్పటికీ, తాజాగా సేకరిస్తున్న ఈ వేస్ట్‌ను రీ డిస్పోజల్ చేయడం, రీ సైక్లింగ్ చేసే పరిజ్ఞానం స్థానికంగా అందుబాటులో లేదు. ఇలాంటి వాటికోసం ఎంపిక చేసిన కేంద్రాలకు తరలించాలి. పాత ఇనుప దుకాణాల వారు కూడ ఇదే చేస్తుంటారు. వారి ఉపాధిని దెబ్బతీసే విధంగా ఈవేస్ట్‌ను కూడా ప్రభుత్వమే సేకరించడం ఎంతవరకు సమంజసమన్న వాదన వినిపిస్తోంది.



నక్కపల్లిలో సెల్‌పాయింట్ నుంచి ఈవేస్ట్‌ను సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది (ఇన్‌సెట్) ప్రభుత్వ కార్యాలయంలో పాడయిన చెత్త డబ్బాల్లో వేస్తున్న సిబ్బంది

పెనుగొల్లు విద్యార్థికి జేఈఈ మెయిన్స్‌లో 116వ ర్యాంకు



మామిడి పూర్ణ సాయి

అనకాపల్లి టౌన్/ఎస్.రాయవరం: ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రామానికి చెందిన మామిడి పూర్ణ సాయి జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 116వ ర్యాంక్, ఓబీసీ కేటగిరిలో 16వ ర్యాంక్ సాధించాడు. పూర్ణ సాయి పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో చదివాడు. ఇంకా ఈ కళాశాలలో చదివిన బండారు యదు వంశీ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 2752వ ర్యాంక్, పీలా మనోజ్‌కుమార్ ఓపెన్ కేటగిరిలో 5583వ ర్యాంక్, ఓబీసీ కేటగిరిలో 1142 ర్యాంకులు సాధించారు. వీరిని కళాశాల డీజీఎం హనుమంతరావు, ఏజీఎం బోదా నాగేశ్వరావు, అధ్యాపకులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



దేవిడ్ జాన్సన్



కె.సత్యసాయి శ్రీనివాస్ భగవాన్

పాయకరావుపేట : శనివారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. కె.సత్యసాయి శ్రీనివాస్ భగవాన్ 77 వ ర్యాంకు, డేవిడ్ జాన్సన్ దేవి 2948 ర్యాంకును సాధించారని తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 23 మంది అర్హత సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, ప్రిన్సిపాల్ భానుమూర్తి, అకడమిక్ ఇన్‌చార్జ్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

నిబంధనల మేరకే పరిహారం చెల్లింపు

- తహసీల్దార్ నర్సింహమూర్తి

నక్కపల్లి : ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు పునరావాసం కోసం ఏపీఐఐసీ వారు కొనుగోలు చేసిన భూముల్లో షెడ్లకు నిబంధనల మేరకే నష్టపరిహారం చెల్లించడం జరిగిందని తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. 'షెడ్లు వేసేయ్ పరిహారం కొట్టేయ్' అన్న శీర్షికన శనివారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఏపీఐఐసీ నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు బోదిగల్లం సమీపంలో సుమారు 121 ఎకరాలు రైతుల నుంచి నేరుగా ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించి భూములు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ భూముల్లో ఏయే కట్టడాలు ఉన్నాయనేది ఉద్యానవన శాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించి నివేదిక సమర్పించారన్నారు. ఇలా సర్వే నంబరు 168లో ఎ.2.83 సెంట్ల విస్తీర్ణంలో రెండు షెడ్లకు రూ.11.52 లక్షలు, సర్వే నెంబరు 171లో 2.72 సెంట్లలో రెండు షెడ్లకు రూ.10.75లక్షలు మొత్తం ముగ్గురు రైతులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. ఉద్యానవన, ఆర్‌అండ్‌బీ అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వారు సూచించిన నివేదిక ఆధారంగా ఏపీఐఐసీ జోనల్‌మేనేజర్ వారు ఈ రైతులకు నష్టపరిహారం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందన్నారు. పరిహారం కోసం ఇతర రైతుల నుంచి ఎటువంటి ఒత్తిళ్లు రాలేదన్నారు. పరిహారం చెల్లింపు పూర్తిగా పారదర్శకంగా జరిగిందన్నారు.

టీడీపీ నాయకులు కావడం వల్లే పరిహారం చెల్లింపు : వీసం

నక్కపల్లి : ఏపీఐఐసీ నిర్వాసితుల కోసం పెద బోదిగల్లంలో కొనుగోలు చేసిన భూముల్లో ఇటీవల ఏర్పాటు చేస్తున్న షెడ్లు టీడీపీ నాయకులకు చెందినవి కావడం వల్లే అధికారులు లక్షలాది రూపాయలు నష్టపరిహారం చెల్లించారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ ఆరోపించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 'షెడ్డు వేసేయ్, పరిహారం కొట్టేయ్' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం పూర్తిగా వాస్తవమేనన్నారు. అధికారులు నష్టపరిహారం చెల్లించిన భూములు, షెడ్లు వివాదంలో ఉన్నాయన్నారు. ఇటీవలే తామంతా కలసి సదరు భూముల సమస్యను ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి పరిష్కరించడం జరిగిందన్నారు. ఆ సమయంలో భూముల్లో ఎటువంటి షెడ్లు లేవన్నారు. తాజాగా ఏర్పాటు చేసిన షెడ్లకు అధికారులు టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు నష్టపరిహారం చెల్లించారన్నారు. ముగ్గురు రైతులకు సుమారు రూ.23 లక్షల నష్టపరిహారం చెల్లించడం దారుణమన్నారు. ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయని, దీనిపై థర్డ్ పార్టీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. చందనాడ, తమ్మయ్యపేట, తదితర గ్రామాల్లో ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో రైతులు పదేళ్ల క్రితం నుంచే ఇటువంటి షెడ్లు వేసుకున్నారని, వారికి ఎందుకు పరిహారం చెల్లించలేదని ప్రశ్నించారు.

నూకాంబిక వైన్ షాప్‌కు షోకాజ్ నోటీస్ జారీ

అనకాపల్లి టౌన్ : ఎంఆర్‌పీ ధరల కన్నా అధికంగా మద్యం విక్రయిస్తున్న షాపులపై ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్న నర్సీపట్నం మండలంలో చెట్టుపల్లి గ్రామంలో నూకాంబిక వైన్ షాప్‌పై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో రూ.99 బెంగుళూర్ విస్కీను రూ.110కు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. తదుపరి షాప్ లైసెన్స్ రద్దు చేసేందుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్ మాట్లాడుతూ జిల్లాలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వారంలో 24 కేసులు నమోదు చేసి 22 మందిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఈ కేసుల్లో 105.6 లీటర్ల సారా, 3080 లీటర్ల బెల్లపు పులుపును, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

పీసీపీఐఆర్ బృహత్తర ప్రణాళిక అమలు చేయాలి



బృహత్తర ప్రణాళిక అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న కె.ఎస్.విశ్వనాథం

తుమ్మపాల : విశాఖపట్నం - కాకినాడ పెట్రోకెమికల్ పెట్రోలియం పెట్టుబడి ప్రాంతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (వీకేపీసీపీఐఆర్) 2041 బృహత్తర ప్రణాళికను సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుని అమలు చేయాలని ఆ సంస్థ వైస్ చైర్మన్ కె.ఎస్.విశ్వనాథన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో వీకేపీసీపీఐఆర్ 2041 బృహత్తర ప్రణాళిక అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బృహత్తర ప్రణాళికలో ముఖ్యమైన సమస్యలు పరిశ్రమలు, రోడ్లు, రేవులను కలుపుతూ అభివృద్ధి చర్యల కోసం కావాల్సిన సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నివాస ప్రాంతాలు, నీటి వనరులు, ప్రభుత్వ భూమి వివరాలు అసోసియేట్ సౌత్ ఏసియన్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి ఇచ్చి బృహత్తర ప్రణాళికలో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రామారావు, పీసీపీఐఆర్ ప్రణాళిక అధికారి, జిల్లా అటవీశాఖ అధికారి శామ్యూల్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీను (ఫైల్)

రావికమతం : మట్టవానిపాలెం గ్రామానికి చెందిన యువకుడు రాపర్తి శ్రీను (32) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అనకాపల్లిలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్న శ్రీను ఎప్పటిలాగే తన పని చేసుకొని అనకాపల్లి నుంచి తిరిగి స్వంత గ్రామం వస్తుండగా అనకాపల్లి మండలం రామాపురంసమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందినట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రమాదం విషయం తెలిసి భార్య అనిత కన్నీరుమున్నీరైంది. శ్రీనుకు మూడేళ్ల పాప మానశ్రీ, 6 నెలలు బాబు గ్రీష్మంత్ ఉన్నారు. అనకాపల్లి రూరల్ ఎస్ఐ రవికుమార్ సంఘటన స్థలం చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరినాగుల హల్‌చల్



భారీ గిరినాగును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ కృష్ణ

దేవరాపల్లి: మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో శనివారం ఒక్క రోజే మూడు భారీ గిరినాగులు హల్‌చల్ చేశాయి. మారేపల్లిలో సుమారు 12 అడుగుల మేర పొడవు ఉన్న ఆడ, మగ గిరి నాగులు పట్టుబడగా, దేవరాపల్లిలో మగ గిరి నాగును నిర్బంధించారు. స్థానికులు, అటవీశాఖ అధికార్ల ద్వారా సమాచారం అందుకున్న ఈస్టర్న్ గార్డ్స్ వైల్డ్ లైఫ్ సొసైటీ బృంద సభ్యులు సకాలంలో ఆయా ప్రాంతాలకు చేరుకొని అతి కష్టం మీద మూడు గిరి నాగులను పట్టుకొని దేవరాపల్లి సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పాములు ఎవరికైనా కనిపిస్తే 8142827308, 9985312242 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని ఈస్టర్న్ గార్డ్స్ వైల్డ్ లైఫ్ సొసైటీకి చెందిన మూర్తి కంటి మహంతి కోరారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

అనకాపల్లి : విద్యుదాఘాతంతో స్థానిక గవరపాలెం చిన్నరామస్వామి ప్రాంతానికి చెందిన విల్లూరి రాజు(47) అక్కడికక్కడే శుక్రవారం మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విల్లూరి రాజు మండలంలో బీఆర్టీ కాలనీలో స్వీట్ దుకాణంలో పని చేస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే శుక్రవారం విధులకు వెళ్లగా స్వీట్ దుకాణం వెనుక ఉన్న విద్యుత్ వైర్లు తెగి పడిపోవడంలో విద్యుత్‌షాక్‌తో విల్లూరి రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి కుమారుడు దినేష్, వివాహం జరిగిన కుమార్తె కుసుమ ఉన్నట్టు చెప్పారు.

బాల్య వివాహాలు నిలుపుదల

నర్సీపట్నం: నాలుగు బాల్య వివాహాలను పోలీసులు, ఐసీడీఎస్, బాలల పరిరక్షణ ప్రతినిధులు నిలుపుదల చేశారు. గబ్బాడ, అయ్యన్నకాలనీ, గురందరపాలెం, నర్సీపట్నంలలో బాల్య వివాహాలు జరుగుతున్న విషయం తెలుసుకున్న సీఐ ఎల్.రేవతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, బాలల పరిరక్షణ ప్రతినిధి కె.రామకృష్ణ వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వివాహాలను నిలువరించారు.

లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

కశింకోట: తాళ్లపాలెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న బైక్‌ను వెనుకగా లారీ ఢీకొంది. దీంతో అనకాపల్లి మండలం దర్జీ నగర్‌కు చెందిన మోహన్‌కృష్ణ, హేమంత్, మరొకరు గాయపడ్డారు. వీరిని స్థానికులు అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యలమంచిలి వివాహానికి వెళ్లి తిరిగి తమ గ్రామానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ విషయమై తమకు ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

మాడుగుల రూరల్: భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జరిగింది. ఎస్ఐ జి. నారాయణరావు కథనం ప్రకారం జాలంపల్లి గ్రామానికి చెందిన పినబోయిన లోవ(38) భార్య లక్ష్మి, వీరిద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. లక్ష్మి కొద్ది రోజుల క్రితం తన పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో లోవ మనస్తాపం చెంది తన పాకల వద్దకు వెళ్లి శనివారం తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

క్లుప్తంగా

1 నుంచి కంప్యూటర్ శిక్షణ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గౌరీ గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయం కో–ఆర్డినేటర్ మళ్ల బాపునాయుడు తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో వచ్చే నెల 1వ నుంచి 30వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు నామమాత్రపు రుసుం రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య

అనకాపల్లి: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని ఏపీటీఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాండ్రేగుల దుర్గాప్రసాద్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను ఎన్నోయేళ్లుగా భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయన్నారు. డీఎస్సీ పోటీ పరీక్షకు వయో పరిమితి 46 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు.

దంత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటేష్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని శారదానగర్‌లో లోటస్ పోలి క్లినిక్ ఆవరణలో ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన లభించింది. పీవీకే మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ శిబిరానికి వంద మంది రోగులు హాజరయ్యారు. వీరికి డాక్టర్ పి. వెంకటేష్ దంత సమస్యలను పరీక్షించి నివారణ మార్గాలను సూచించారు. కార్యక్రమంలో ఆడారి శ్రీనివాసరావు, ఆర్వీ గోపాల్, సుధాకర్, రిషిత, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన పీలా మోహన్‌రావు

అనకాపల్లి: వేసవి దృష్టిలో పెట్టుకుని పాదచారులకు, వాహనదారులకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని బంగారు వర్తకుడు పీలా మోహన్‌రావు కోరారు. స్థానిక మెయిన్‌రోడ్డు పెరుగుబజార్ జంక్షన్ వద్ద పీలా దివ్యతేజ జ్ఞాపకార్థంగా పేదలకు చీరలు పంపిణీ చేసి, మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ప్రతి సోమవారం 200 మందికి భోజనం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. 365 రోజులు చలివేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు డి.రవి, ఎస్ చిన్ని, ఎం శంకర్, కె.అచ్చినాయుడు, నాగరాజు, ఎస్ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 2,072 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠధర	గరిష్ఠధర
మొదటి రకం	3,790	4,310
రెండో రకం	3,370	4,110
మూడో రకం	2,950	3,330

అనకాపల్లి సినిమాలు

రాజా : మ్యాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : గుడ్ అండ్ బ్యాడ్ అగ్లీ
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : కోర్టు
శ్రీసత్య : మధురం
రామచంద్ర : జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 25 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-3, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరు సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 347 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

వేసవి దుక్కు.. లాభాలు దక్కు

రైతు ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కి దున్నాల్సిందే.. విత్తేందుకు, నాటేందుకు అనుకూలంగా పొలాన్ని సిద్ధం చేసుకోవాల్సిందే. దుక్కి చేయకుండా వదిలేయడం వల్ల భూమి సత్తువ కోల్పోతుంది. చీడపీడలకు ఆవాసంగా మారుతుంది. ముడి పోషకాల లోపం ఏర్పడి తర్వాత పంటకు భారీగా ఎరువులు వేయాల్సి వస్తుంది. అందుకే రైతులు వేసవిలో లోతు దుక్కులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

- 300 ఎకరాల్లో వరి సాగుకు ప్రణాళిక
- సాగు యోగ్యంగా బీడు భూములు
- ఖరీఫ్ దృష్టిలో పెట్టుకుని దుక్కులు
- భూసారం పెంచేందుకు కృషి



వెంకుపాలెంలో దుక్కు దున్నుతున్న రైతు



సీతానగరంలో భూసారం పెంచేందుకు దున్నిన భూమి

అనకాపల్లి: మండలంలో 300 ఎకరాల బీడు భూముల్లో వరి, ఇతర పంటలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతేడాది సుమారుగా 5,600 ఎకరాల్లో వరి పంటలు వేశారు. పంట కోతల తర్వాత మళ్లీ వర్షాకాలం వచ్చేంత వరకూ నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారిపోతాయి. వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. పంటలు లేని వేసవిలో చీడపురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమిని ఆశ్రయిస్తాయి. వేరుశనగ, పప్పు శనగ, కంది, మినుములు, కూరగాయలు పంటలు వేసినప్పుడు లద్దె పురుగులు భూమిలో ఉండిపోతాయి. వేసవిలో లోతు దుక్కులు చేస్తే నేలలో చీడ పురుగులు, కోశాలు, గుడ్లు బయటపడి మృత్యువాత పడతాయి. కొంగలు, కాకులు ఇతర జంతువులు వాటిని తిని నాశనం చేస్తాయి. కలుపును నివారించవచ్చు. వేసవి దుక్కులు చేయడం ద్వారా వర్షపు నీరు లోపలి పొరల్లోకి ఇంకి భూమి సారాన్ని పెంచుతుంది. దుక్కి చేయకుండా భూమిని ఖాళీగా వదిలేయడం వల్ల కలుపు మొక్కలు, ఇతర గడ్డి జాతి మొక్కలు పెరిగి భూమిలోని తేమను, పోషకాలను గ్రహించి భూమిని సత్తువ లేకుండా నిర్వీర్యం చేస్తాయి.

దుక్కిదున్నడం వల్ల ప్రయోజనాలు....

- సమగ్ర సస్యరక్షణలో భాగంగా వేసవిలో లోతు దుక్కలను చేయడంతో పురుగు మందుల వ్యయం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.
- వర్షాలకు ముందు భూమిని వాలుకు అడ్డంగా దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోనికి ఇంకుతుంది.
- భూమిని దున్నడం వల్ల గడ్డిజాతి మొక్కల విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు గురై మొలిచే శక్తిని కోల్పోతాయి.
- దుక్కు అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువులు, పొలంలో చల్లుకోవాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు సంవృద్ధిగా అందుతాయి.
- వేసవిలో దుక్కి దున్నితే భూమి గుల్లగా మారుతుంది. భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా, తేమలో జీవించే వానపాముల సంతతి వృద్ధి చెందుతాయి. వానపాములు భూసార పరీక్షలకు ఉపయోగపడుతుంది.
- లోతు దుక్కులు చేయడం వల్ల వరిలో కాండం తొలచు పురుగు, రెప్పవాల్చు పురుగు, లద్దెపురుగు, ఇతర పురుగులు మృత్యువాత పడతాయి.
- పొలంలో గత పంట అవశేషాలుంటే లోతుగా దున్నడంతో భూమిలో కలిసి కుళ్లిపోతాయి. ఫలితంగా సేంద్రియ ఎరువుగా మారి భూమికి బలాన్ని అందిస్తాయి.
- దుక్కులు దున్నే సమయంలో వేసవిలో వచ్చే వర్షాలు భూమిలో వర్షపు నీరు నిల్వ ఉండే విధంగా రైతులు చూసుకోవాలి.
- మార్చి మొదటి వారం నుంచి మే 2వ వారం వరకూ వేసవి దుక్కులకు అనుకూలంగాను, రానున్న ఖరీఫ్ పంటకు సంబంధించి ఇప్పటికే రైతులు వేసవి దుక్కులు చురుగ్గా చేసుకోవాలి.
- రోజురోజుకు భూతాపం తగ్గిపోతుంది. రైతులు పంటలు పండించే సమయంలో రైతులకు దిగుబడి లేకుండా పోతుంది.
- మండలంలో చాలా భూమి జీవం లేకుండా పోతుంది. సాగులోనికి తీసుకువచ్చే విధంగా రైతులు కృషి చేయాలి.
- సారవంతమైన భూమితో ఆర్గానిక్, కార్బన్ శాతం 1 నుంచి 3 శాతం ఉండాలి. ప్రస్తుతం 0.2 శాతం మాత్రమే ఉంది.
- భూమికి సారం రావాలంటే పశువుల గెత్తం, పచ్చిరొట్ట విత్తనాలు వేసి ఒక దుక్కు దున్నాలి.
- తొలకరి వర్షం పడగానే జనుము, పిల్లిపెసరు, జీలుగలు 2 కేజీలు, మినుములు, పెసలు, బొబ్బర్లు, ఉలవలు అరకేజీ చొప్పున, తొటకూర, గోంగూర 50 గ్రాములు భూమిలో ఎకరానికి 12 కేజీలు కలిపి దుక్కు దున్నడం వల్ల భూసారం పెరుగుతుంది.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కులు చేసుకుంటే భూమిలో ఉన్న చీడపీడ పురుగులు నశించిపోతాయి. భూసారం పెరుగుతుంది. వేసవి వర్షాలు నీరు భూమిలోకి బాగా చేరుతుంది. వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ తర్వాత భూమిని వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు వేయాలి. దీనివల్ల భూమి సారం పెరుగుతుంది. ఎరువులు శాతం తగ్గుతుంది. పంట దిగుబడి బాగుంటుంది.

– పి.రంగాచారి,ఏవో, అనకాపల్లి

మే 20న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అనకాపల్లి: ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మికుల చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పు చేస్తుందని, వీటిని కాపాడాలని మే 20న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మెకు తలపెట్టినట్టు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆయన మాట్లాడారు. రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచే విధానాలు తీసుకొచ్చిందన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతులను కాపాడుకోవల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలని, వేతనదారుల బకాయిలు దేశంలో రూ.27,400 కోట్లు, రాష్ట్రంలో రూ. 2,400 కోట్లు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని ప్రభుత్వాలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. లోకనాథం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఆర్. రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, నాయకులు జి. నాయినబాబు, జి.కోటేశ్వరరావు, గంటా శ్రీరామ్, కె. భవానీ, య.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాలువ పనుల అడ్డగింత

కశింకోట: తాళ్లపాలెం వద్ద పోలవరం కాలువలో కోల్పోయిన తన భూమికి పరిహారం చెల్లించే వరకు పనులు చేయొద్దని బాధిత రైతు కోన నాగేశ్వరరావు శనివారం అడ్డుకున్నాడు. దీంతో అధికారులు పనులు నిలుపుదల చేశారు. తాళ్లపాలెంకు చెందిన బాధితుడు నాగేశ్వరరావుకు చెందిన 32 సెంట్ల పట్టా భూమి పోలవరం కాలువ నిర్మాణంలో సేకరించారు. ఇందుకు పరిహారం చెల్లించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా 19 సంవత్సరాలుగా నిర్లక్ష్యం చూపుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత భూమిలో కాంట్రాక్టర్, అధికారులు చెట్లను తొలగించే ప్రయత్నం చేయగా రైతు నాగేశ్వరరావు అడ్డుకున్నాడు. తనకు పరిహారం చెల్లించే వరకు పనులు చేయడానికి ససేమిరా ఒప్పుకోలేదు. దీంతో పనులు నిలిపి వేసి నిష్క్రమించారు. పరిహారం చెల్లింపు విషయమై ముఖ్యమంత్రి చర్యలు తీసుకుని న్యాయం చేయాలని నాగేశ్వరరావు కోరాడు.

చెరకు రైతులు, కార్మికుల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

అనకాపల్లి: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికులు బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2024–25 క్రషింగ్ సీజన్‌లో రైతులకు రూ.35 కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. ఇటీవల కాలంలో రూ.5 కోట్లు బకాయిలు చెల్లించారని, మిగిలిన రూ.30 కోట్లు రైతుల బకాయిలు, కార్మికుల జీతాలు చెల్లించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లాలో తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఇచ్చిన హామీలు నేటి వరకూ అమలు చేయలేదన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి నడిపిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, నాయకులు గండి నాయనబాబు, ఎస్‌వీ నాయుడు, సాంబశివరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి వాణీజగదీశ్వరి తెలిపారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి. సంగం, ఎం. మరియమ్మ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం.. నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ మల్లికార్జునరావు



నిందుతుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

పరవాడ : పరవాడ మండలం సంతబయలులో ఈ నెల 15న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. పరవాడ డీఎస్పీ వి. విష్ణు స్వరూప్ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లాలం రమణమ్మ అనే మహిళ ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు, వెండి ఆభరణాలు, నగదు దొంగిలించినట్లు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అచ్చుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన ఎస్. జగ్గప్పారావును పరవాడ మండల కాంప్లెక్స్ కూడలిలో అరెస్టు చేసి, అతని నుంచి 8 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ. 32 వేలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐలు బి.కృష్ణారావు, మహాలక్ష్మి, బి.వై.నాయుడు, హెచ్‌సీ సాయి సంతోష్, పోలీసు సిబ్బంది నాగేంద్ర, నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి సంతాపం

సబ్బవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న కర్రి అప్పనాయుడు ఆత్మహత్య చేసుకోవడంతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించి, విద్యార్థితో తమకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

స్నేహితుడుకి అండగా..



అనారోగ్యంతో ఉన్న స్నేహితుడ్ని పరామర్శిస్తున్న పూర్వ విద్యార్థులు

పెందుర్తి: తమతో పాటు చదువుకుని ప్రస్తుతం తీవ్ర అనారోగ్యానికి గురైన వ్యక్తికి స్నేహితులు అండగా నిలిచారు. అతడి చికిత్స నిమిత్తం రూ.20 వేలు సమకూర్చారు. మండలంలోని గొరపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు (1992–93 బ్యాచ్) తమ స్నేహితుడు సొంటియ మురళీకృష్ణ అనారోగ్యానికి గురయ్యాడని తెలుసుకుని ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు అందించారు.

మేయర్ పదవి కోసం దిగజారుడు రాజకీయం



మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పద్మను శాలువాతో సత్కరిస్తున్న భరత్‌కుమార్



సురేష్ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భరత్

- త్వరలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: తమ కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురిచేసి మేయర్ పదవిని దక్కించుకోవడం అన్యాయమని, త్వరలో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. స్థానిక రింగ్‌రోడ్డు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో శనివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి పాలకులు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి ప్రజల మన్ననలను పొందాలని కోరారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా, నేటికీ పేదలకు ఏ ఒక్కా పథకం అమలు చేయలేదన్నారు. నియోజకవర్గంలో గ్రామీణ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సంక్షేమ పథకాల రథసారథి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఇప్పటికే వెయ్యి నేత్రాలతో ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఎప్పుడు సాధారణ ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీని గెలిపించి తీరుతారని జోష్యం చెప్పారు. త్వరలో గ్రామీణ స్థాయి నుంచి పార్టీ కమిటీల నియామకం జరుగుతుందన్నారు. అనంతరం పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా నియమితులైన కె.పద్మని మలసా భరత్‌కుమార్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, సీనియర్ జిల్లా నాయకులు దాడి నారాయణరావు, గణేష్, గైపూర్ రాజు, కాండ్రేగుల హైమావతి, పెంటకోట శ్రీనివాసరావు, శ్రీధరాల మనోజ్, సూరిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ విలీన గ్రామం కె.ఎస్.ఆర్.పేటలో...

జీవీఎంసీ విలీన గ్రామమైన కె.ఎస్.ఆర్.పేటలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు కరణం సురేష్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. పెద్దకర్మలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ నివాళులర్పించారు. పార్టీ నాయకులు మలసాల కుమార్‌రాజా, కలగ గున్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆకట్టుకున్న ప్రాజెక్టులు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కశింకోట: మండలంలోని ఏపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ కమ్యూనిటీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో విద్యార్థులు తయారు చేసిన రోబోటిక్, సెన్సార్ ఆధారిత నమూనాలు, పర్యావరణ హిత ప్రోటో టైప్స్ వంటి వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఏఎంఏఎల్ కళాశాల జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ హరిబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రాజెక్టులను పరిశీలించి వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలతోపాటు తాళ్లపాలెం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు 600 మంది తరలి వచ్చి ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఇవి విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ జి. గ్రేస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలనకు డిమాండ్



డీఆర్వోకు వినతి ప్రతం అందిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

తుమ్మపాల: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని విశ్వహిందూ పరిషత్తు (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు డి.డి. నాయుడు, నగర అధ్యక్షుడు నుదురుపాటి తాతాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వో సత్యనారాయణరావుకు వినతిపత్రం సమర్పించారు. ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న హిందువులకు సరైన రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఆరవెల్లి సాయిప్రదీప్, బీజేపీ నగర అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి శ్రీకాళహస్తి, సరిస సింహాచలం, కార్యకర్తలు దుర్గా వాహిని, మహిళా మణులు అచ్యుతాంబ పాల్గొన్నారు.

చింతలపాలెంలో మురుగు కాలువలు శుభ్రం



సిమెంట్ రోడ్డుపై మురుగు పారకుండా శుభ్రపరుస్తున్న పంచాయతీ సిబ్బంది



శుభ్రం చేయక ముందు సిమెంట్ రోడ్డు(ఫైల్)

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట: సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని చింతలపాలెంలో మురుగుతో నిండిన సిమెంట్ రోడ్డు, కాలువలను శనివారం శుభ్రపరిచారు. రోడ్డుకు అడ్డంగా చాలా రోజులుగా మురుగు నీరు ఏరులా పారుతుండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్న విషయమై ఈ నెల 16న 'చింతలపాలెంలో మురుగు నీటితో అవస్థలు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే సిమెంట్ రోడ్డుపై మురుగు నీరు ప్రవహించకుండా కాలువలను శుభ్రపరిచారు. రోడ్డుపై మురుగు నీరు పారకుండా చర్యలు తీసుకుని కాలువలను శుభ్రపరిచామని ఆమె తెలిపారు. అయితే గ్రామంలోని మురుగు నీరు పోవడానికి జాతీయ రహదారి కాలువను శుభ్రపరచి మార్గాన్ని సుగమం చేయడానికి మాత్రం ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. మురుగు నీటి ప్రవాహం నుంచి సిమెంట్ రోడ్డుకు మోక్షం లభించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

26న నూకాంబిక అమ్మవారి జాతర



ఘటాలను ఊరేగిస్తున్న ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక నెల పండగ చాటింపు కార్యక్రమం జరిగిందని ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను తెలిపారు. స్థానిక అమ్మవారి ముఖద్వారం వద్ద శనివారం అమ్మవారి కొత్త అమావాస్య జాతర ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఘటాలను ఊరేగించారు. ఈనెల 26న అమ్మవారి జాతర, 27న నెల పండుగ ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.